గౌరవ వేతనం ఏదీ?

- జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు అందని గౌరవ వేతనం
- సంవత్సరం గడిచినా ప్రజాప్రతినిధులకు అందని బకాయిలు
- సర్వసభ్య సమావేశాలకే పరిమితం
- సమస్యలు విన్నవించినా పట్టించుకోని అధికారులు



సర్వసభ్య సమావేశానికి హాజరైన జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు (ఫైల్)

గుడిబండ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులను విస్మరించింది. అభివృద్ధి కార్యక్రమాల్లో వీరిని భాగస్వాములను చేయడం లేదు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం ఇవ్వడం లేదు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు వీరిని ఆహ్వానించడం లేదు. కూటమి హయాంలో ఇంత వరకూ గౌరవ వేతనం కూడా మంజూరు చేయలేదు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రాధాన్యం ఇవ్వనప్పటికీ.. గౌరవ వేతనం కూడా ఇవ్వకపోవడంపై సభ్యులు మండిపడుతున్నారు. ఇదే సమయంలో ఎలాంటి హోదా లేనప్పటికీ టీడీపీ నాయకులకు అధికారులు ప్రాధాన్యత ఇస్తున్నారంటూ పలువురు ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులను అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములను చేయకపోవడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

వేతనం కోసం ఎదురు చూపులు

మడకశిర నియోజకవర్గం పరిధిలోని 5 మండలాల్లో 85 మంది ఎంపీటీసీ సభ్యులు, 5 మంది జెడ్పీటీసీలు ఉన్నారు. అగళి మండలంలో 11 మంది, అమరాపురం మండలంలో 15 మంది, గుడిబండ మండలంలో 15 మంది, రొళ్ల మండలంలో 11 మంది, మడకశిర రూరల్ మండలంలో 18 మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. వీరికి ప్రతినెలా రూ.3,000 గౌరవ వేతనంగా ఇవ్వాల్సి ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో సక్రమంగా గౌరవ వేతనం చెల్లించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం పూర్తయినప్పటికీ ఇప్పటి వరకూ జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు గౌరవ వేతనం చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. గౌరవ వేతనాలపై దృష్టి సారించడం లేదు. ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటికీ రెండుసార్లు బడ్జెట్ కేటాయింపులు జరిగినా ప్రజాప్రనిధుల ఖాతాల్లోకి మాత్రం నగదు జమ కాకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

పట్టించుకోని అధికారులు..

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఎంపీటీసీ సభ్యులు సర్వసభ్య సమావేశాలకు మాత్రమే పరిమితమయ్యారు. సమావేశాలకు హాజరు కావడం మినహా ప్రజా సమస్యలు సభ దృష్టికి తీసుకొచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదని సభ్యులు చెబుతున్నారు. కనీసం ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు సైతం ఆహ్వానించకపోవడం దారుణమని వాపోతున్నారు.

కార్యక్రమాలకు ఆహ్వానించరు

కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులను పట్టించుకోవడం లేదు. కనీస సమాచారం కూడా ఇవ్వకుండా వివక్ష చూపుతున్నారు. కేవలం సర్వసభ్య సమావేశానికే పరిమితం అవుతున్నాం. సర్వసభ సమావేశాల్లో పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కావడం లేదు.

– తౌసీఫ్, కో–ఆప్షన్ మెంబర్, గుడిబండ మండలం

ఎంపీటీసీ సభ్యులంటే చులకన భావం



ప్రజలతో ఎన్నుకోబడిన ఎంపీటీసీ సభ్యులంటే అధికార యంత్రాంగం చులకన భావంతో చూస్తున్నారు. అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానించడం లేదు. పథకాల సమాచారం కూడా చెప్పడం లేదు. కూటమి ప్రభుత్వం జెడ్పీటీసీ, ఎంపీటీసీలను అవమానిస్తోంది. ఇది సరైన పద్ధతి కాదు.

– రాజన్న, ఎంపీటీసీ సభ్యుడు, గుడిబండ మండలం

మంజూరు చేయాలి



దాదాపు కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాన్ని మంజూరు చేయాలి. ఈ విషయంలో ఉన్నతస్థాయి అధికారులు చొరవ తీసుకుని, న్యాయం చేయాలి. స్థానికంగా నిర్వహిస్తున్న అధికారిక కార్యక్రమాలకు మమ్మల్ని ఆహ్వానించాలి. కేవలం సర్వసభ్య సమావేశాలకే పరిమితం చేయడం సరికాదు.

– రత్నమ్మ, వైస్ ఎంపీపీ, గుడిబండ మండలం

క్లుప్తంగా

ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు


ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి

పెనుకొండ: న్యాయ సేవలు అవసరమైన ఖైదీలకు ఉచితంగా అందిస్తామని జిల్లా న్యాయసేవా అధికార సేవా సంస్థ కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. శనివారం పెనుకొండ సబ్‌జైలును జిల్లా న్యాయసేవా అధికార సేవా సంస్థ కార్యదర్శి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఖైదీలు ఎలాంటి సదుపాయాలు పొందుతున్నారన్న విషయాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. నేరుగా ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీల సమస్యలు, బ్యారక్‌లు, భోజన శాలను పరిశీలించారు. న్యాయవాదులు మోహన్‌నాయక్, కొండంపల్లి శ్రీరాములు, ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కంఠం స్థలాన్ని బస్‌షెల్టర్‌కు ఉపయోగించండి


తురకలాపట్నంలో ఎరువు దిబ్బలను తొలగిస్తున్న దృశ్యం

రొద్దం: మండలంలోని తురకలాపట్నం గ్రామ నడిబొడ్డున సర్వే నంబర్ 251–1 ఉన్న గ్రామ కంఠం (పశువుల దొడ్డి) స్థలాన్ని బస్‌షెల్టర్‌కు ఉపయోగిచాలని సర్పంచ్ లక్ష్మీదేవి, గ్రామస్తులు కోరారు. గ్రామానికి బస్‌ షెల్టర్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ఆ స్థలంలో వేసిన పశువుల ఎరువు దిబ్బలను రెవెన్యూ అధికారులు తొలగింపజేశారు.

భాష్యం పాఠశాలపై చర్యలు తీసుకోండి


ఆర్టీఓ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

హిందూపురం టౌన్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఓవర్ లోడ్‌తో పరిమితికి మంచి బస్సులలో విద్యార్థులను తరలిస్తున్న భాష్యం పాఠశాలపై చర్యలు తీసుకోవాలని వైఎస్ఆర్ఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు కదిరీష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బాబావలి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆర్టీఓ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ ఫిట్‌నెస్ లేని బస్సులు నడుపుతూ, పరిమితికి మించి ఎక్కించుకుని వెళుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. ఇప్పటికైనా రవాణా శాఖ అధికారులు స్పందించి భాష్యం పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా మోక్ష మార్గోపదేశ సభలు


కార్యక్రమంలో పాల్గొన్న క్రైస్తవులు

పెనుకొండ: పట్టణంలోని బైబిల్ మిషన్ చర్చిలో బైబిల్‌మిషన్ చర్చి మోక్ష మార్గోపదేశ సభలు శనివారం జరిగాయి. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ సుధాకర్, ఇతర ప్రతినిధులు బందెల రాజు, రెవరెండ్ ప్రభాకర్, మనోహర్, ఇస్సకు బాబు తదితరులు ఏసు ప్రభువు బోధనలను వినిపించారు. కార్యక్రమంలో పెద్దఎత్తున క్రైస్తవులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్


పోలీసులు స్వాధీనం చేసుకున్న బైకులు

పావగడ: క్యాతగానహళ్లి సమీపంలోని చెరువు కట్ట వద్ద నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై శనివారం సాయంత్రం మధుగిరి డీఎస్పీ మంజునాథ్ ఆధ్వర్యంలో ప్రత్యేక క్రైం బృందం దాడులు చేపట్టారు. ఈ సందర్భంగా 5 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ 90 వేల నగదు, 25 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో మధుగిరి స్క్వాడ్ బృందం కేబీ రామకృష్ణయ్య, దిలీప్ కుమార్, గణేశ్, మను, మారుతి పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సౌకర్యాలు కల్పించాలి


వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గుడిబండ: మండల వ్యాప్తంగా ఉన్న వసతి గృహాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు అంజి, వినోద్, తిప్పేష్ తదితరులు డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు కనీస సౌకర్యాలు అందక ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. మెనూ పాటించకుండా ఇష్టానుసారంగా భోజనం వడ్డిస్తున్నారని తెలిపారు. కొందరు వార్డెన్లు ప్రతి నిత్యం మద్యం సేవించి వసతి గృహాల్లోకి వస్తున్నారని ఆరోపించారు. సక్రమంగా పని చేయని వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉచితంగా స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ కోర్సులు

హిందూపురం టౌన్: పట్టణంలోని ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ బేసిక్స్, స్పోకెన్ ఇంగ్లిష్‌లో సర్టిఫికెట్ కోర్సును ఇంటర్ పూర్తి చేసిన అమ్మాయిల కోసం ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రగతి శనివారం తెలిపారు. జూలై 2న నుంచి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఉచితంగా కోర్సు తరగతుల నిర్వహిస్తున్నామని, రిజిస్ట్రేషన్ ఫీజు రూ.100 చెల్లించాలరు. ఆసక్తి గల విద్యార్థినులు పేర్లు నమోదు చేసుకోవాలలన్నారు. మరింత సమాచారానికి 6303432820, 9959224585 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బెల్టు దుకాణాలపై కేసులు నమోదు చేయండి


తూముకుంట చెక్‌పోస్టులో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

హిందూపురం టౌన్: హిందూపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బెల్టు షాపులపై నిర్వహణపై నిఘా ఉంచి, కేసులు నమోదు చేయాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య సూచించారు. శనివారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌ను అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్ కలసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసులు, మద్యం అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడిన వాహనాలు త్వరగా క్లియర్ చేయాలన్నారు. కల్లు దుకాణల నుంచి శాంపిల్స్ సేకరించి చిత్తూరు కెమికల్ ల్యాబ్‌కు పంపించాలని, కల్తీ కల్లు అరికట్టేలా కల్లు విక్రయదారులకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. కల్తీ కల్లు విక్రయదారులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని, కర్ణాటక మద్యం అక్రమ రవాణా దారుల మీద కేసులు నమోదు చేసి, పాత నిందితులు, అనుమానితులను బైండోవర్ చేయాలన్నారు. పరారైన నిందితులను అరెస్ట్ చేయాలని ఆదేశించారు. అలాగే మెత్తనాల్ యూనిట్లను ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం తూముకుంట చెక్ పోస్టును తనిఖీ చేసి, వాహనాలు క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. విధులపై అలసత్వం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలి..

మడకశిర: నియోజకవర్గంలోకి అక్రమ మద్యం రాకుండా గట్టి నిఘా పెట్టాలని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డీసీ నాగమద్దయ్య ఆదేశించారు. శనివారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీరామ్‌తో కలిసి మడకశిర ఎక్సైజ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, నియోజకవర్గంలో నమోదైన ఎక్సైజ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలోని మద్యం షాపుల్లో స్టాక్ వివరాలను పరిశీలించారు. ఎమ్మార్పీ ధరకే మద్యం అమ్మాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కార్మికుల పని గంటలు పెంచడం అన్యాయం


మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు వెంకటేశ్

మడకశిర: కూటమి ప్రభుత్వం కార్మికుల పని గంటలను పెంచడం చాలా అన్యాయమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ విమర్శించారు. పని గంటలను 8 నుంచి 10 గంటలకు పెంచి కూటమి ప్రభుత్వం కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తోందని ధ్వజమెత్తారు. శనివారం పట్టణంలో సీఐటీయూ మండల కమిటీ సమావేశం జరిగింది. మండల కమిటీ అధ్యక్షురాలు పద్మావతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. రాత్రి వేళల్లో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఇలాంటి పరిస్థితిలో మహిళా కార్మికులు రాత్రి వేళల్లో కూడా పని చేయాలని కూటమి ప్రభుత్వం చెప్పడం దారుణమని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం పెట్టుబడి దారులకు అనుకూలంగా, కార్మికులకు వ్యతిరేకంగా పని చేస్తోందని విమర్శించారు. కార్మికులు, ఉద్యోగులను బానిసలుగా మార్చే చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. శ్రీరామరెడ్డి తాగునీటి పథకంలో పని చేసే కార్మికులు 84 రోజుల నుంచి వేతనాల కోసం సమ్మె చేస్తున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వివిధ శాఖల్లో పని చేసే కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఐకేపీల్లో పని చేసే కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలన్నారు. కార్మికుల సమస్యలపై జూలై 9న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నూతన కమిటీ ఏర్పాటు

మడకశిర మండల సీఐటీయూ నూతన కమిటీని ఏర్పాటు చేశారు. మండల కన్వీనర్‌గా పద్మావతి, కో–కన్వీనర్లుగా హరీఫా, మల్లేశ్, ఈశ్వరయ్య, గంగాధర్, కళావతి, సభ్యులుగా కళ, బాలు, చిత్తనగిరి, తిప్పమ్మ, గంగాధర్‌ను ఎన్నుకున్నారు. వీరిని సీఐటీయూ నాయకులు ఘనంగా సన్మానించారు. సమావేశంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల నుంచి విద్యార్థి అదృశ్యం

- ఇంట్లో ప్రత్యక్షం


విద్యార్థిని పాఠశాలలో అప్పగిస్తున్న పోలీసులు, తల్లిదండ్రులు

లేపాక్షి: మండలంలోని నాయనిపల్లి క్రాస్ సమీపంలో ఉన్న అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న మహేంద్ర శనివారం పాఠశాల గోడ దూకి పరారయ్యాడు. వివరాలు.. ఉదయం జరిగిన ప్రార్థనకు విద్యార్థి హాజరయ్యాడు. కొద్ది సేపటి తర్వాత కడుపునొప్పి వస్తుందని తోటి విద్యార్థులు, ఉపాధ్యాయుడికి తెలిపాడు. కొంతసేపు విశ్రాంతి తీసుకోమని చెప్పి ఉపాధ్యాయుడు తరగతి గదులకు వెళ్లారు. విద్యార్థి గదిలోకి వెళ్లకుండా గోడదూకి పరారయ్యాడు. తరగతి గదిలో విద్యార్థి కనబడక పోవడంతో ఉపాధ్యాయులు ప్రిన్సిపాల్ మధుసూదన్‌రావుకు సమాచారం ఇచ్చారు. ప్రిన్సిపాల్ వెంటనే స్పందించి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. అయితే విద్యార్థి ఇంటికి చేరిన విషయం తెలుసుకున్న పాఠశాల సిబ్బంది, పోలీసులు వారి సొంత గ్రామానికి వెళ్లారు. విద్యార్థి తల్లిదండ్రులతో వారు మాట్లాడి విద్యార్థిని పాఠశాలకు తీసుకెళ్లారు.

జ్ఞాన సముపార్జనకు ప్రాధాన్యత ఇవ్వాలి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

పావగడ: ఇది జ్ఞాన యుగం. జ్ఞాన సముపార్జనకు ప్రాధాన్యత ఇవ్వాలని మధుగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల సహ ప్రాధ్యాపకుడు గోవిందరాయ విద్యార్థులకు సూచించారు. స్థానిక వైఈ రంగయ్య శెట్టి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం తృతీయ సంవత్సరం డిగ్రీ విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ వయస్సులో పొందిన జ్ఞాన సంపద మీ ఉజ్వల భవిష్యత్తుకు పునాది అవుతుందన్నారు. మీ నుంచి సంపదను లాక్కోవచ్చు అని.. జ్ఞానాన్ని లాక్కోలేరన్నారు. ప్రయత్నిస్తే అనుకున్నది సాధించవచ్చని తెలిపారు. వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, సహ ప్రాధ్యాపకుడు డా. మురళీధర్ తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

‘అరెస్టులకు భయపడే ప్రసక్తే లేదు’


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మడకశిర/చిలమత్తూరు: వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి. అరెస్టులకు భయపడే ప్రసక్తే లేదని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మంజునాథ్, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ రాజశేఖర్, క్రిస్టియన్ మైనారిటీ విభాగం అధ్యక్షుడు నరసింహ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై మడకశిర సోషల్ మీడియా కార్యకర్త గుండుమల మంజునాథ్ అసభ్యకర పోస్టులను సోషల్ మీడియాలో పెట్టాడనే కారణంతో అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. కోర్టు రిమాండ్ విధించడంతో మంజునాథ్ ప్రస్తుతం హిందూపురం సబ్‌జైలులో ఉన్నారు. శనివారం మడకశిర వైఎస్సార్‌సీపీ నాయకులు హిందూపురం వెళ్లి సబ్‌జైలులో ఉన్న మంజునాథ్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదరికంలో ఉన్న మంజునాథ్‌పై టీడీపీ నాయకులు అక్రమ కేసు పెట్టడం అన్యాయమని తెలిపారు. దళితులను కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా కార్యకర్త మంజునాథ్‌కు జరిగిన అన్యాయాన్ని రాష్ట్ర సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ అంజిరెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. మంజునాథ్‌కు బెయిల్ ఇప్పించడానికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామని అంజిరెడ్డి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. మంజునాథ్‌కు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రంగనాథ్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు టీడీపల్లి రంగనాథ్, నరేష్, నగేష్, తిప్పేస్వామి పాల్గొన్నారు.

మంజునాథ్ అరెస్ట్ దుర్మార్గం

వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్త గుండుమల మంజునాథ్ అరెస్ట్‌ను నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. అరెస్టులతో కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను భయపెట్టడానికి ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. అరెస్టులకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు భయపడే ప్రసక్తేలేదన్నారు. మంజునాథ్‌కు అండగా ఉంటామని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి


నివాళులర్పిస్తున్న సమన్వయకర్త ఈరలక్కప్ప

అమరాపురం: మండల పరిధిలోని కెంకెర గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు నాగరాజు (40) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మడకశిర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాగరాజు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ కోసం నాగరాజు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు హలుకూరు కాంతరాజు, మడకశిర నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు శివన్న, ఎంపీపీ ఈరన్న, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ గోవిందరాయ, వైఎస్సార్‌సీపీ నాయకులు మంజునాథరెడ్డి, బీడీ మూర్తి, సత్యనారాయణ, యంజేరప్ప, సురేష్, ఇషాక్, రసూల్‌బాషా, పలువురు ఎంపీటీసీలు సర్పంచులు నివాళులర్పించారు. యువ నాయకుడిని పార్టీ కోల్పోయిందని తెలిపారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి


మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ మైనుద్దీన్

హిందూపురం: ప్రతిఒక్కరూ తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ తహసీల్దార్ మైనుద్దీన్ సూచించారు. సివిల్ రైట్స్ డే సందర్భంగా మండలంలోని మలుగూరు, నందమూరి నగర్‌లలో సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా డీటీ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకారం పౌరహక్కులు ప్రతి పౌరుడికి కల్పించిన గొప్పవరమన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు ప్రజలకు సేవలు అందించాల్సి ఉంటుందన్నారు. బాల్యవివాహాలు, 18ఏళ్లలోపు పిల్లలను పనులకు పంపించడం, మత్తుపదార్థాలు వినియోగం, మూఢనమ్మకాలను అచారించడం వంటి వాటికి చట్టప్రకారం నేరమన్నారు. అనంతరం గ్రామంలో సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సచివాయల సిబ్బంది, గ్రామ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పోలీసు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తండాల అభివృద్ధికి చర్యలు

సోమందేపల్లి: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన దార్తి అభా అభియాన్ కార్యక్రమంలో భాగంగా తండాలు, గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపీడీఓ వెంకటలక్ష్మయ్య తెలిపారు. శనివారం నాగినాయని చెరువు తండాలో గ్రామసభ ఏర్పాటు చేశారు. కనీస మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పథకాల అభివృద్ధిపై చర్చించారు. కార్యక్రమంలో సర్పంచ్ అంజినాయక్, డిప్యూటీ తహసీల్దార్ రెడ్డి శేఖర్, ఏఓ విజయభారతి తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: గ్రామాల్లో ప్రతి ఒక్కరూ అన్నదమ్ముల్లగా కలసిమెలసి జీవించాలని తహసీల్దార్ షేక్షావలి పేర్కొన్నారు. శనివారం మండలంలోని రత్నగిరి పంచాయతీ పరిధిలోని అలుపనపల్లి ఎస్సీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ షేక్షావలి మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ గిరియప్ప, జమెదార్ రామలింగయ్య, ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, వీఆర్వో నాగరాజు, మాజీ కన్వీనర్ దాసిరెడ్డి పాల్గొన్నారు.

పేట వెంకటరమణ ఆలయంలో పూజలు



అలంకరణలో వెంకటేశ్వరస్వామి , శనీశ్వరస్వామి

హిందూపురం: పట్టణంలోని మెయిన్‌బజార్‌లో పేట వేంకటరమణ స్వామి ఆలయంలో శనివారం ఉదయం మూలవిరాట్ వెంకట రమణస్వామికి ఫల, పంచామృతాభిషేకాలు చేసి విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మహామంగళహారుతులిచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలతో ప్రసాదాలను అందజేశారు. అలాగే శ్రీదేవి భూదేవి సమేత పేట వెంకటరమణ స్వామి ఉత్సవమూర్తుల ప్రాకారోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, కమిటీసభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని డీబీ కాలనీ, టీచర్స్‌కాలనీలోని శనీశ్వరస్వామి ఆలయాల్లో మూలవిరాట్‌కు తిల తైలాభిషేకాలు నిర్వహించి విశేషంగా వెండి కవచ అభరణాలతో అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జైష్టదేవి సమేత శనిదేవుడి ఉత్సవ మూర్తులను విశేష పుష్పాలంకరణలు చేసి ప్రాకారోత్సవం నిర్వహించి కొలువుదీర్చారు. ఈ సందర్భంగా ఉదయం, సాయంత్రం వందలాది భక్తులు తరలివచ్చి ఆలయ ఎదుట తిల తైలాలతో దీపారాధనలు చేసి, మూలవిరాట్ తిల తైలాభిషేకాలు చేసి నవగ్రహ శాంతి పూజలు అర్చనలు నిర్వహించారు.

కొనసాగుతున్న నామినేషన్ల పర్వం

పావగడ: స్థానిక శని మహాత్మ కార్య నిర్వాహక సంఘం డైరెక్టర్ల స్థానాల ఎన్నికలకు నామినేషన్ల దాఖలు పర్వం సజావుగా సాగుతోంది. ఈ ఎన్నికలు జూలై 13న జరగనున్నాయి. ఈ ఎన్నికలకు సంబంధించి ఈనెల 27న నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. మొదటి రోజు కె.పురుషోత్తం నామినేషన్ దాఖలు చేయగా.. రెండవ రోజు శనివారం కేవీ రామనాథ శెట్టి, 28న కట్టాపెరుమాళ్, ఎన్‌కే నాగరాజు, ఎస్ఆర్ అశ్వర్థ కుమార్, ఎస్.ఆర్ వెంకటరామిరెడ్డి తమ నామినేషన్ దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి పీఎస్ సోమశేఖర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్ పత్రాలు స్వీకరిస్తామని పేర్కొన్నారు. జూలై 2వ తేదీన నామినేషన్ దాఖలు ప్రక్రియ ముగుస్తుందని చెప్పారు.

అన్నా క్యాంటీన్ నిర్మాణానికి భూమి పూజ

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో రూ. 61 లక్షలతో ఎన్‌టీఆర్ అన్నా క్యాంటీన్ నిర్మాణానికి మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథి శనివారం భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ మూడు నెలల్లో భవన నిర్మాణం పూర్తి చేసి, ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం , రాత్రికి భోజనం అందిస్తామన్నారు. అనంతరం ఎంపీ బీకే పార్థసారథి మాట్లాడారు.

కంటైనర్‌ను ఢీ కొన్న లారీ


రోడ్డుపై పడి ఉన్న కంటైనర్

సోమందేపల్లి: మండల పరిధిలోని వెలుగు మాకులపల్లి క్రాస్ వద్ద జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న కంటైనర్ లారీని మరో లారీ ఢీ కొనింది. శనివారం జరిగిన ఈ ప్రమాదంలో డ్రైవర్‌లు జబీవుల్లా, కందేస్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. వాహనాలు రోడ్డుపై పడిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వాహనాలను తొలగించారు.

లేపాక్షిలో ప్రత్యేక పూజలు


అలంకరణలో వీరభద్రస్వామి

లేపాక్షి: పర్యాటక కేంద్రమైన లేపాక్షి దేవాలయంలో దుర్గాదేవి, వీరభద్ర స్వాముల వారిని శనివారం ఉదయం ప్రత్యేకంగా అలంకరించి విశేషంగా పూజలు చేశారు. దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. దేవాలయంలోని చిత్రాలు, శిల్పాలు తిలకించిన పర్యాటకులు పులకించి పోయారు. ఈ సందర్భంగా అభిషేకార్చనలు, తీర్థప్రసాద వినియోగాలు, మహామంగళారతి తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు, అన్నదానం చేశారు.